# ముగింపు

రెంటాల హనుమత్ప్రసాద్

"మూర్తీ"

వెను తిరిగి చూశాను. ఎదురుగా విశ్వపతి నిలబడి వున్నాడు.

"ఎప్పుడొచ్చావ్!" ఆశ్చర్యంగా అడిగాను.

"ఒక గంటయ్యింది" నవ్వుతూ జవాబిచ్చాడు.

"వచ్చే ముందు లెటరు వ్రాయలేదేం? వచ్చి రిసీవ్ చేసుకునే ణ్ణి కదా!"

"అనుకోకుండా వచ్చాను. లేకుంటే రాసేవాణ్ణే. పద అలా హోటల్లోకి వెళ్ళి కాఫీ త్రాగుదాం".

విశ్వపతి వెంట నడిచాను. ఇద్దరం జనసమర్ధంలోనుండి తప్పించుకుని ఎదురుగా కనబడిన ఉడిపి హోటల్లోకి నడిచాము.

ఓ మూల వున్న టేబుల్ ముందు కూర్చున్నా మిద్దరం. కిటికీగుండా మెయిన్ రోడ్ కనబడుతున్నది.

విశ్వపతి, నేను చూసినప్పటి కంటె బాగా లావైనాడు. మనిషి బాగా సంపాదిస్తున్నాడల్లేవుంది. లేకుంటే అతని ఆకారంలో అంత మార్పు వచ్చి వుండేది కాదు. అతనూ నేనూ చాలా కాలం నుండి స్నేహితులం. డిగ్రీ అవగానే విశ్వపతి కొద్ది పెట్టుబడితో బిజినెస్‌లోకి దిగాడు. అతనిలో ఒక గొప్ప గుణం వుంది. అది మంచిగుణం అనండి, లేదా చెడ్డదనే అనండి. విశ్వపతి గొప్ప మాటకారి. ఎదుటివాళ్ళను తన మాటలతో ఇట్టే లొంగదీసుకుంటాడు. ఎంతటి నమ్మదగని విషయమైనాసరే ఎదుటి వాళ్ళను ఇట్టే నమ్మించేయగలకు తనకున్న ఆ ప్రతిభ వల్లనే ఎంతో సునాయాసంగా బిజినెస్ లోనికి చొచ్చుకుని వెళ్ళాడని నిస్సందేహంగా చెప్పవచ్చు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్" విశ్వపతి మాటలకు ఉలిక్కిపడ్డాను.

"అబ్బే ఏమీలేదు" అని సమాధానమిచ్చి "ఎన్నాళ్ళుంటావ్" అని అడిగాను.

సర్వర్ రావటంతో కాఫీకి ఆర్డరిచ్చి చిన్నగా నవ్వాడు, "ఎన్నాళ్ళోనా" అంటూ.

"అంటే........"

"ఇంకో గంటలో వెళ్ళాలి"

"ఏం అంత అర్జంటా! చాలారోజులకు కలిశావు. రెండు రోజులు ఉండి వెళ్ళకూడదూ. సరదాగా కాలక్షేపం చెయ్యొ

వచ్చు" అన్నాను.

"లేదు ఈరోజే వెళ్ళాలి.విజయవాడకు ఓ మంత్రిగారు ఏదో శంకుస్థాపనకని వస్తున్నారట. ఆయన్ను కలవాలి. ఆయన వల్ల జరగవలసిన పనులు కొన్ని వున్నాయి. అందుకని ఆయనతో మాట్లాడాలి. లేకపోతే తప్పకుండా ఉండేవాణ్ణి. నీ శ్రీమతిని కూడా చూసినట్లు ఉండేది" సిగరెట్ తనొకటి వెలిగించుకుని నాకొకటి ఆఫర్ చేశాడు.

విశ్వపతి నా పెళ్ళికి రాలేదు. ఆ టైమ్‌లో విశ్వపతికి బోల్డు ఇబ్బందులు ఎదురైనాయి. కొత్తగా అప్పుడే బిజినెస్ పెట్టడంవలన పనుల ఒత్తిడివలన పెళ్ళికి రాలేక పోతున్నానని ఉత్తరం వ్రాశాడు.

"నీ ఉద్యోగం ఎలా వుంది"

"నా వుద్యోగానికేం లక్షణమైంది." నవ్వుతూ అన్నాను.

"ఎన్నాళ్ళయింది నీవు ఉద్యోగంలో చేరి" హటాత్తుగా అడిగాడు.

"నాలుగేళ్ళు"

"ముందుకు జరిగావా, లేక అక్కడే వున్నావా" సిగరెట్ పొగని రింగులుగా వదులుతూ అన్నాడు.

"అంటే....?" అర్థం కాలేదు నాకు.

"అదే ప్రమోషన్ ఏమీ లేదా ?" అంటూ నవ్వాడు.

"లేదు"

"ఓ హెల్ప్ చెయ్యగలవా?"

"ఏమిటి" ఆశ్చర్యంగా అడిగాను.

"నా కజిన్ ఒకడున్నాడు వాడు డిగ్రీ పాసయ్యాడు.ఉద్యోగంకోసం సతమతమై పోతున్నాడు. మీ ఆఫీసర్‌తో చెప్పి ఏమన్నా చూడగలవేమోనని...మీ ఆఫీసర్ మేసే వాడైతే మరీ మంచిది. తృణమో పణమో పారేద్దాం" నా సమాధానం కోసం ఉత్సాహంగా ముందుకు జరిగాడు బల్లమీద చేతులు ఆన్చి.

విశ్వపతి మాటలకు పెద్దగా నవ్వాను. "మా ఆఫీసర్ అలాంటివాడుకాదు. చండశాసనుడు"అంటూ, విశ్వపతి ఆలోచనకు నవ్వుకున్నాను. ఇలాంటి విశ్వపతులను మా ఆఫీసర్ ఎంతోమందిని చూశాడు. పాత ఆఫీసర్ టైమ్‌లో అర్హత లేనటువంటి వాళ్ళు చాలామంది రికమండేషన్లతో, లంచాలతో వచ్చారు. ఈయన అలాంటి వాడు కాదు.

"మూర్తీ ఆమెను చూడు" హఠాత్తుగా అన్నాడు విశ్వపతి రోడ్డుమీద పండ్లను కొంటున్న ఓ స్త్రీని చూపుతూ.

"ఆమె నీకు తెలుసా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ తెలుసు"

ఒక్కక్షణం ఆమె వంక చూశాను. హోటల్ కిటికీలో నుండి ఆమె స్పష్టంగా కనబడుతున్నది.

"ఎవరామె" అడిగాను నేను

"మా మామయ్య కూతురు అదే .... నీకొకసారి చెప్పాను. గుర్తులేదూ?నన్ను ప్రేమిస్తున్నాననిచెప్పి మోసం చేసిందని ఆమే ఈమె." గట్టిగా ఓ మారు పొగ పీల్చి అన్నాడు విశ్వపతి.

"అపును ఓసారి చెప్పావు గుర్తుంది. అసలు ఆమె నిన్ను ఎందుకు మోసం చేసింది" ఆశ్చర్యంగా అడిగాను

రిక్షాలో వెళుతున్న ఆమెవంక ఓమారు చూసి "హు! చూస్తాను. ఆమె జీవితం

నాశనం చెయ్యకపోతే నా పేరు విశ్వపతే కాదు."

ఉలిక్కిపడ్డాను విశ్వపతి మాటలకు. ముందువున్న మూడు గ్లాసుల్లోని నీళ్ళను త్రాగి "అసలు విషయం చెప్పు"అన్నాను ముందుకు జరుగుతూ.

ఓ మారు టైమ్ చూసుకున్నాడు విశ్వపతి.

నేను చూపించిన ఉత్సాహానికి ఓమారు నవ్వి అన్నాడు. "నీవు ఎందుకు అడుగుతున్నావో నాకు తెలుసు. కథకు పాయింట్ లాగదామని కదూ"

నేను కథలు రాస్తుంటానని విశ్వపతికి తెలుసు అందుకనే అలా అడిగాడు.

నవ్వి ఊరుకున్నాను.

"ఆమె నాకు స్వయాన మేనమామ కూతురు" చెప్పటం మొదలు పెట్టాడు విశ్వపతి. బలంగా ఓమారు సిగరెట్ పొగ పీల్చి వదులుతూ.

ఇంట్రెస్ట్‌గా వినసాగాను.

"చిన్నప్పటినుండి ఇద్దరం కలసిమెలసి తిరిగాం. ఆమెంటే నాకు ప్రాణం. అలాగే నేనంటే ఆమెకు. కాలేజీలో చేరినతరువాత మెల్లగా ఆమెలో మార్పురావటం మొదలు పెట్టింది అప్పటికి మేము పెద్దగా ఆస్తిపరులం కాదు. మావయ్యకు మాత్రం బోలెడు ఆస్థి వుంది. కాలేజీలో చేరిన దగ్గర నుండి ఆమెకు చాలామంది బాయ్ ఫ్రెండ్స్ తోడయ్యారు. అందరితో సోషల్‌గా మూవ్ అవుతుండేది. నేను అంతగా పట్టించుకునే వాణ్ని కాదు. ఆమె మనసు నాదే అనుకున్నాను. మెల్లగా ఆమెలో మార్పు రాసాగింది. నేనంటే ఆమెలో నిర్లక్ష్యం చోటు చేసుకుంది. ఎవడి స్కూటర్ వెనుకనో, ఇంకే వెధవ కారులోనో తిరుగుతుండేది.ఆమెప్రవర్తన నాకు నచ్చలేదు. ఇక ఒకరోజు సహించలేక ఆమె ప్రవర్తనగురించి మావయ్యతో చెప్పాను. అందుకు ఆయన పెద్దగా పట్టించుకోకుండా 'చిన్నపిల్లలేదూ మెల్లగా తెలుసుకుంటుంది. నేను చెప్పి కోప్పడతాలే' అంటూ నన్ను అనునయించాడు. ఒకరోజు ఆమెతో అన్నాను 'ఇలాగైతే మనిద్దరికీ ముడిపడదని' అందుకు ఆమె ఏమన్నదో తెలుసా?"దాదుబలంగా దమ్ము పీల్చి వదులుతూ అన్నాడు.

"ఏమన్నది?" ఆశ్చర్యంగా అడిగాను.

"నీకూ నాకూ ఎవడు ముడివేస్తున్నాడు అన్నది. ఆ రోజు నుండి ఇక ఆమె ముఖం చూడలేదు. పెళ్ళికి రమ్మని మావయ్య ఉత్తరం వ్రాసినా నేను వెళ్ళలేదు. మళ్ళీ ఈ రోజే ఆమెను ఇక్కడ చూశాను. ఇక వదలను"

"ఏంచేస్తావ్" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆమె నాకు చాలాకాలం క్రితం రెండు ప్రేమలేఖలు వ్రాసింది. అవి మేం ఇద్దరం సఖ్యతగా వున్నరోజుల్లో నాటివి. ఆమె అడ్రస్ తెలుసుకుని ఆమె మొగుడికి పంపుతాను. ఆ దెబ్బతో కాని నా హృదయం తేలిక పడదు"

ఒక్కక్షణం నేనేమీ మాట్లాడలేదు.

"ఈ రెండు ఉత్తరాలు పంపటంతో నీ కథకు ముగింపు పూర్తయింది" చివరంటా కాలిన సిగరెట్‌ను బూటు క్రింద నలుపుతూ అన్నాడు విశ్వపతి.

"ముగింపు బాగోలేదు" అన్నాను నేను.

"కొన్ని ముగింపులు ఇలాగే వుండాలి. పద. నాకు టైమవుతున్నది" లేచాడు విశ్వపతి.

విశ్వపతి బిల్లు చెల్లించాడు. అతని వెంట బయటకు నడిచాను. ఇద్దరం స్టేషన్ రోడ్డు పట్టాం.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్" అడిగాడు విశ్వపతి.

"నీవు చెప్పిన కథకు ముగింపు ఆలోచిస్తున్నాను" అన్నాను.

"మీ రచయితలకు ఏదీ చెప్పి ఏడవకూడదు. ఏదన్నా దొరికిందంటే ఒకపట్టాన వదలరు" నవ్వాడు విశ్వపతి.

ఇద్దరం స్టేషన్ చేరుకున్నాము నాకు ప్లాట్ ఫారం ! టిక్కెట్టు తీసుకున్నాడు విశ్వపతి. మేము లోనికి వెళ్ళేటప్పటికి ప్లాట్ ఫారం మీద బండి రెడీగావున్నది. విశ్వపతి ఖాళీగా వున్న ఒక పెట్టెలో ఎక్కి కూర్చున్నాడు.

"మళ్ళీ ఎప్పుడొస్తావ్?" అడిగాను.

"చెప్పలేను. చాలా బిజీగా వున్నాను" అన్నాడు నవ్వుతూ.

విశ్వపతి ప్రక్కన కూర్చునవాడిని కాస్తా లేచాను. "నా కథకు ముగింపు దొరికింది" అన్నాను నవ్వుతూ.

"ఐతే ఇందాకటినుంచి నీకు కావలసిన ముగింపుకోసం ఆలోచిస్తూనే వున్నావన్నమాట" ఆశ్చర్యంగా అన్నాడు.

"ముగింపు ఎప్పుడో దొరికింది" నవ్వాను నేను.

"మరి చెప్పవేం" ఉత్సాహంగా అడిగాడు విశ్వపతి.

"నా కథలో హీరోయిన్ పేరు సుజాత"

ఉలిక్కిపడ్డాడు విశ్వపతి సుజాత అన్నపేరు నా నోటివెంట విని. నేను గమనించినా గమనించనట్లే వుండిపోయాను.

"హీరో పేరు విశ్వపతి" విశ్వపతి నా వంక ఆశ్చర్యంగా చూస్తూ వినటం గమనించాను.

"సుజాత విశ్వపతిని ప్రేమిస్తుంది. విశ్వపతికూడా సుజాతను ప్రేమిస్తున్నట్లు నటిస్తాడు. విశ్వపతి చాలా తెలివైనవాడు. సుజాతను ప్రేమించకపోయినా సుజాత ఆస్తిని మాత్రం అతను ప్రేమించాడు. సుజాత ఆమె తండ్రికి ఒక్కతే కూతురు కావటంతో ఆస్తి అంతా తనకే దక్కుతుందనుకున్నాడు పెళ్ళి చేసుకుంటే. ఆమె తండ్రి సుజాతను విశ్వపతికి ఇచ్చి పెళ్ళి చెయ్యటానికైతే ఒప్పుకున్నాడుగాని ఆస్తిని మాత్రం ఇవ్వటానికి ఒప్పుకోలేదు. తన ఆస్తినంతటినీ ధర్మాలయాలకు, దేశ రక్షణకు మాత్రమే వినియోగిస్తానన్నాడు. చేతనయితే స్వయంగా సంపాదించుకుని బ్రతకమని సలహా ఇచ్చాడు. అది నచ్చలేదు విశ్వపతికి. సుజాత ప్రాధేయపడినా వినిపించుకోక నీకు ఆస్తి లేనప్పుడు ఇక నీవు నాకెందుకు అని కాలదన్నాడు" నేను చెప్పటం ఆపి విశ్వపతి వంక చూశాను.

విశ్వపతి ముఖం వెలా తెలా బోతున్నది.

"ఎలా వున్నది ఈ ముగింపు" కొద్ది

క్షణాల తరువాత ఎటో చూస్తూ అన్నాను.

అతనినుండి సమాధానం ఆశించడానికి వీలులేకపోయింది బండి కదలటంతో.

"విశ్వపతీ! ఆమె నాకు నీ గురించి చెప్పింది. ఆమె చాలా ఉత్తమురాలు. ఆమెమీద అన్యాయంగా ఓ కథ అల్లి చెప్పావు ...."

"ఆమె నీకెలా తెలుసు" విశ్వపతి గొంతు కొద్దిగా వణుకుతున్నట్టుగా వుంది.

"ఆమె నా భార్య" అంటూ కదులుతున్న రైల్లోంచి కిందకు దూకాను. ●

# బొమ్మలు - కథలు

పత్రికలలో చదివే ప్రతి కథకూ బొమ్మవుంటే చాలా బాగుంటోంది.

పుస్తకరూపంగా ప్రచురణ అయే కథలకు బొమ్మలుండవు లోపల. సాధారణంగా అట్టమీద మాత్రం బొమ్మ వుంటుంది. కొందరు ప్రచురణకర్తలు దీనికికూడ దండుగ ఎందుకని సిబ్బిరేకు లాంటి అట్ట కాగితం మీద పొడి పొడి అక్షరాలలో పుస్తకం పేరు, రచయిత పేరు, తమ పేరు వేసేసి వూరుకుంటారు.

అంటే పత్రికలలో కథలకూ, పుస్తకాలలో కథలకు ముఖ్యమయిన తేడా బొమ్మలు అన్నమాట.

మరో సంగతి — ప్రతి కథల పత్రిక తమ కథల కన్నిటికీ బొమ్మలు వేయించదు. ఒక్కొక్కసారి-ఒకే కథకు రెండు మూడు బొమ్మలు కూడా వేయిస్తారు.

కథలకు బొమ్మలు వేయాలంటే కథల రచయితకు-బొమ్మల రచయితకు 'కో-ఆర్డినేషన్' వుండాలి. ఇది లేకపోతే కథ-బొమ్మలు తీర్థానికి తీర్థమూ, ప్రసాదానికి ప్రసాదంఅయిపోతాయి. రెండువిడివిడిగా బాగుంటాయికానికలిపిచూచినప్పుడు ఎత్తేట్టుగా- నవ్వునట్లుగా వుండిపోతాయి.

ఒక కథ చెబుతాను :

ఆ కథలో నాయకురాలి ఎడమచేతి వేళ్ళు రెండు కుంపటికి తగిలాయి. అంతేకాదు, 'కుంపటి ఆర్పేసి వస్తాను. లేకపోతే అనవసరంగా నీళ్లు ఆవిరి అయిపోతాయి. నిప్పులు బూడిద అయిపోతాయి' అంటుంది భర్తతో ఒకమారు.

ఈ కథకు వ్రాసిన బొమ్మలో నాయకురాలు గ్యాస్‌స్టవ్ ముందు నిలబడి వయ్యారంగా వంటచేస్తూ వుంటుంది. ఈరోజుల్లో గ్యాస్‌స్టవ్ లేనివాళ్ళెవరులెండి!

మరోకథ ఇందులో పెళ్ళిచూపులసీను అమ్మాయి తంబుర శృతి చేసుకుని 'చక్కని రాజమార్గము' అనే త్యాగరాజ కీర్తన ముచ్చటగా పాడింది - అన్నాడు కథకుడు. ఆమె లేత తమలపాకులా వుంది అని ముందే చెప్పాడుకూడా.

బొమ్మలో గుమ్మడి పండులాంటి ఆమె వీణ ముందు పెట్టుకుని నోరంతా తెరచుకుని కూర్చుంది.

పోయిన - దసరాకు 'అమ్మవారి' ముఖచిత్రం వేశారు ఒక పత్రికలో.

ఆ అమ్మవారికి రెండూ కుడికాళ్ళే వున్నాయి. 'కుడి ఎడమ అయితే పొరపాటు లేదోయ్!' కూర్చున్నప్పుడు ఫరవాలేదేమోగాని - నడవటానికి ఇబ్బంది అవదా? అయినా కథల్లో బొమ్మలు నటుస్తాయా? మనను నడిపిస్తాయా? ●